సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ వెంకటేశ్వరరావు

మరో 'చెత్త' ఉపాయం

- ఇంటి పన్నుతో అనుసంధానం
- ప్రజలపై ఆర్థిక భారం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

చెత్త పన్ను వసూలుకు ఏ ఒక్క అవకాశాన్నీ వదులుకొనేలా లేరు. ఇప్పటికే ప్రభుత్వం అనేక మార్గాలను అనుసరించగా తాజాగా సరికొత్త నిర్ణయాన్ని తెరమీదకు తీసుకొచ్చింది. పన్ను వసూలు కోసం పలు రూపాల్లో ప్రజలను ఇబ్బంది పెడుతూ వచ్చినా ససేమిరా అంటున్నారు. చెత్తకు పన్ను వసూలు ఏమిటని ప్రశ్నిస్తున్నారు. సచివాలయం, మహిళా సంఘాలకు లక్ష్యాలను నిర్దేశించినా ఆశించిన మేరకు వసూలు కావడం లేదు. ఉమ్మడి జిల్లాలో ఇంటి పన్నుకు చెత్త పన్నును అనుసంధానం చేసి పిండుకునేందుకు సరికొత్త ఉపాయం చేస్తున్నారు. కేవలం అనుసంధానం చేస్తున్నామని చెబుతున్నప్పటికీ ఎప్పుడూ లేని చెత్త పన్నుతో ఎందుకు అనుసంధానం చేస్తున్నారన్నది ప్రశ్నార్థకంగా మారింది. ఇప్పటికిప్పుడు కాకున్నా రాబోయే రోజుల్లో ఇంటి పన్నుతో సహా ప్రతి ఆరు నెలలకోసారి చెత్త పన్ను కలిపేందుకు ప్రక్రియ చేపడుతున్నట్లు అవగతమవుతోంది. ఈ మేరకు ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావడంతో ప్రజలపై ఆర్థిక భారం మోపేందుకు నగరపాలక సంస్థ సిద్ధమవుతోంది. ఈనెల 15 నుంచి పది రోజులపాటు రెవెన్యూ వసూళ్ల వెబ్‌సైట్‌ను నిలుపుదల చేసి అనుసంధానం చేస్తున్నారు.

మ్యాపింగ్‌కు చిక్కులే..

క్లీన్ ఆంధ్రప్రదేశ్ (క్లాప్) ప్రక్రియ గత ఏడాది జూన్ నుంచి ప్రారంభించారు. ఇప్పటికే ఏడాది దాటినా ఇళ్ల నుంచి ప్రతి నెలా చెత్త పన్ను లక్ష్యం మేరకు వసూలు కావడం లేదు. క్లాప్ పథకం అమలు కింద ఒక్కో ఆటోకు ప్రతి నెలా ప్రభుత్వం కొంత సొమ్ము ఏజెన్సీకి చెల్లించాలి. కానీ చెత్త పన్నులు సక్రమంగా వసూలు కాకపోవడంతో నగరపాలక సంస్థ పరిధిలోనే సాధారణ నిధుల నుంచి ఏజెన్సీకి నిధులు చెల్లించాల్సి వస్తోంది. ఇదే పరిస్థితి జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల్లోనూ కొనసాగుతోంది. నరపాలక సంస్థలో కొంత ఆర్థిక వనరులు ఉండటంతో భారమైనా నిధులను సర్దుబాటు చేసి ఆటోలు తిరగడానికి ప్రయత్నిస్తున్నారు. చిన్నచిన్న పట్టణ, పురపాలికల్లో ప్రతి నెలా చెత్త పన్నులు ఆయా మున్సిపాలిటీల నుంచి చెల్లించడం సాధ్యం కాదు. ఈ నేపథ్యంలోనే ఇంటి పన్నుతో మ్యాపింగ్ చేపట్టారు. సాధారణంగా ఇంటి యజమాని పేరుతో పన్నులు వసూలు చేస్తారు. కొందరు బహుళ అంతస్థులు, నివాసాలు, తదితర ప్రాంతాల్లో అద్దెకు ఉంటారు. అద్దెకు ఉన్న వారు చెత్తను వేస్తే ఇంటి యజమాని పన్ను కట్టాల్సి వస్తుంది. నివాసాల మ్యాపింగ్ చేసే ప్రక్రియ జరుగుతోంది. ఈ విధానం రాబోయే రోజుల్లో ఇంటి యజమానులకు సమస్యగా మారనుందని భావిస్తున్నారు. యంత్రాంగం మాత్రం ఉత్తర్వులు వచ్చిందే తరువాయి మ్యాపింగ్ మాత్రం చకచకా చేస్తున్నారు. ఈ ప్రక్రియ వల్ల ఇంటి పన్ను కట్టే అంశంలో ప్రతిబంధకంగా మారనుండటంతో పన్ను ల వసూళ్లపై ప్రభావం పడే ప్రమాదం ఉంది.

సేకరణ అంతంతమాత్రమే..

ఇంటింటా చెత్తను వేరుచేసి క్లాప్ ఆటోల ద్వారా తరలించాల్సి ఉంటుంది. ప్రతి ఇంటికీ మూడు చెత్త బిన్నులు ఇవ్వడంతో తడి, పొడి, హానికారక వ్యర్థాలను అందులోకి వేయాల్సి ఉంటుంది. ఆటో రాగానే మూడు అరల్లోకి వేయాల్సి ఉంటుంది. వాహనం వద్ద డ్రైవరు, కార్మికులు పట్టించుకోవడం లేదు. చెత్త వేరు చేయాలన్న నిబంధనలున్నా అంతా ఒకే అరలోకే పడేస్తున్నారు. రోజూ వాహనాలు రావడం లేదు. నగరం, పుర, పట్టణాల్లో ఎక్కడపడితే అక్కడ చెత్త దర్శనం ఇస్తుండటంతో క్లీన్ ఆం ధ్రప్రదేశ్ లక్ష్యం నెరవేరడం లేదు.

అనుసంధానం చేస్తున్నాం

ఇంటి పన్నును సచివాలయం వారీగా ఉన్న నివాసాలను గుర్తించి క్లాప్ పరిధిలోకి వచ్చే వాటిని అనుసంధానం చేస్తున్నాం. యూజర్ ఛార్జీలు వసూలు కోసం అని కాదు.. ప్రభుత్వం నుంచి వచ్చిన ఆదేశాలను అమలు చేస్తున్నాం. భవిష్యత్‌లో ప్రభుత్వ నిర్ణయంతో వసూళ్ల ప్రక్రియ చేపట్టడం జరుగుతుంది. ప్రస్తుతానికి ఇంటి పన్ను వసూళ్లపైనే దృష్టి పెట్టాం.

- చల్లా ఓబులేసు, నగర పాలక సంస్థ కమిషనరు

ప్రభుత్వ విద్యారంగం నిర్వీర్యం

- ప్రయివేట్ పాఠశాలల్లో ప్రవేశాలు పెరిగేలా పాఠశాలల విలీనం
- డిఎస్‌సి ఊసే లేదు
- ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు
- ఉద్యమాలతోనే విద్యారంగ సమస్యల పరిష్కారం
- పూర్వ ఎమ్మెల్సీ ఎం.వి.ఎస్ శర్మ

ప్రజాశక్తి - పలాస, వజ్రపుకొత్తూరు

ప్రభుత్వరంగ విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేసేలా రాష్ట్ర ప్రభుత్వ విధానాలు ఉన్నాయని ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు విమర్శించారు. యుటిఎఫ్ జిల్లా 17వ కౌన్సిల్ సమావేశాన్ని కాశీబుగ్గ రైల్వే ఇన్‌స్టిట్యూట్‌లో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన విద్యా విధానం పేరుతో కేంద్ర ప్రభుత్వ ఆదేశాలను అందరికంటే ముందుగా వైసిపి ప్రభుత్వం అమలు చేస్తోందని చెప్పారు. విద్యా వ్యవస్థకు నష్టదాయకంగా మారనున్న నూతన విద్యా విధానంపై పెద్దఎత్తున ఉద్యమిస్తున్నా పట్టనట్లుగా ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు. పాఠశాలల విలీనం ద్వారా రాష్ట్రంలో 15 వేల పాఠశాలలు మూతపడ్డాయని తెలిపారు. ప్రాథమిక పాఠశాలల విలీనం పేరుతో సుమారు మూడు లక్షల మంది విద్యార్థులు ప్రయివేటు పాఠశాలలో చేరేలా ప్రభుత్వం చేసిందని విమర్శించారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకొచ్చి నాలుగేళ్లు అవుతున్నా డిఎస్‌సి ప్రకటన జాడే లేదన్నారు. రాష్ట్రంలో సుమారు 52 వేల ఉపాధ్యాయుల పోస్టులు ఖాళీగా ఉంటే, 715 ఖాళీలు మాత్రమే ఉన్నాయని విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ చెప్పడం మభ్య పెట్టడమేనన్నారు. ఉపాధ్యాయులు ఉద్యమాల ద్వారా సాధించుకున్న ప్రయోజనాలకు ఒక్కొక్కటిగా ప్రభుత్వాలు కోత విధిస్తున్నాయన్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్లు అనుభవిస్తున్న ప్రతి ప్రయోజనం ఉద్యమం ద్వారా సాధించుకున్నవేనని గుర్తుచేశారు.

ఉద్యమాలతోనే విద్యారంగ సమస్యల పరిష్కారం

సంస్కరణల పేరుతో ప్రభుత్వ విద్యారంగాన్ని నాశనం చేశారని పూర్వ ఎమ్మెల్సీ ఎం.వి.ఎస్ శర్మ విమర్శించారు. రానున్న కాలంలో బైజూస్ యాప్ మాత్రమే విద్యార్థులకు పాఠాలు చెప్పబోతోందని, దీంతో బోధనకు ఉపాధ్యాయుల అవసరం అంతగా లేకుండా పోతుందన్నారు. తద్వారా మరిన్ని ఉపాధ్యాయ పోస్టులను ప్రభుత్వం కుదించనుందని చెప్పారు. బైజూస్ యాప్ ద్వారా బోధనతో విద్యార్థులు రోబోలుగా మారడం ఖాయమని, ఇప్పటికే నైతిక విలువలతో కూడిన విద్య అందించలేకపోతున్నామని తెలిపారు. యాప్‌లతో ఉపాధ్యాయుల్లో తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారని తెలిపారు. సిపిఎస్ పాపంలో చంద్రబాబు, జగన్‌కు సమాన భాగస్వామ్యం ఉందన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల జీతాల నుంచి కంట్రిబ్యూషన్ కట్టించుకుంటూ పెన్షన్ చెల్లించే విధానాన్ని ఇక అంగీకరించబోరన్నారు. సిపిఎస్ రద్దు హామీ ఇవ్వని కొన్ని రాష్ట్రాల్లో ఆ విధానాన్ని రద్దు చేసి ఒపిఎస్‌ను అమలు చేస్తూ విధి విధానాలను రూపొందిస్తున్నాయని చెప్పారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీని అమలు చేసి, మాట నిలబెట్టుకోవాలన్నారు. ఐక్య ఉద్యమాలతోనే విద్యారంగ సమస్యల పరిష్కారం సాధ్యమని స్పష్టం చేశారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో డబ్బు ప్రభావం పెరిగిందన్నారు. శాసనమండలిలో పిడిఎఫ్ బలం తగ్గినా సమస్యలపై తమ గళం బలంగానే వినిపిస్తామన్నారు.

మాట్లాడుతున్న పూర్వ ఎమ్మెల్సీ ఎం.వి.ఎస్ శర్మ

సిపిఎస్‌ను రద్దు చేయాలి

ఉద్యోగులు, ఉపాధ్యాయులకు నష్టం చేకూరుస్తున్న కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సిపిఎస్)ను రద్దు చేయాలని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. సిపిఎస్‌కు ప్రత్యామ్నాయంగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జిపిఎస్ విధానం ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఏమాత్రం లాభదాయకం కాదన్నారు. కార్పొరేట్లకు లాభాన్ని చేకూర్చే సిపిఎస్, జిపిఎస్ విధానాలను యుటిఎఫ్ అంగీకరించదని తేల్చిచెప్పారు. సమావేశంలో ఆర్థిక నివేదికను బమ్మిడి శ్రీరామ్మూర్తి, ఆడిట్ నివేకను డి.రవికుమార్, సిపిఎస్ నివేదికను నారాయణరావు, అకడమిక్ కార్యక్రమాలు నివేదికను ఎల్.వి చలం, మహిళా ఉద్యమ నివేదికను ధనలక్ష్మి ప్రవేశపెట్టారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి చౌదరి రవీంద్ర, యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.అప్పారావు, ఎస్.కిషోర్ కుమార్, నాయకులు జి.గిరిధర్, బి.చిట్టిబాబు, జి.కోదండరావు, ఎల్.బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు అవినీతి 'స్కిల్' చూపించారు

ప్రజాశక్తి - టెక్కలి రూరల్

యువతకు నైపుణ్య శిక్షణ ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం సీమెన్స్ కంపెనీతో కుదుర్చుకున్న ఒప్పందాన్ని స్కిల్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టులో చంద్రబాబు తన అవినీతి స్కిల్ చూపించారాని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ ఆరోపించారు. ఆదివారం టెక్కలి వైసిపి కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఒప్పందంలో సీమెన్స్ కంపెనీ వాటా రూ.3,300 కోట్లు కాగా, రాష్ట్ర ప్రభుత్వం 10శాతం వాటాగా ఉన్న రూ.371 కోట్లను ముందుగానే విడుదల చేసి ఆ నిధులను చంద్రబాబు తన బినామీ కంపెనీలకు తరలించారని ఆరోపించారు. చంద్రబాబు హయాంలో జరిగిన ఈ స్కాంను చంద్రబాబు అండ్-కో చాల పకడ్బందీగా అమలు చేశారని అన్నారు. ఇప్పటికే ఈ కేసులో నలుగురు అరెస్ట్ అయ్యారని, త్వరలో చంద్రబాబు కూడా జైలుకి వెళ్లడం ఖాయమన్నారు. టిడిపి హయాంలో బాబు బటన్ నొక్కగానే ప్రభుత్వ ఖాతా నుండి అటు ఇటు తిరిగి ఆయన ఖాతాలోకి డబ్బులు వచ్చేలా చూసుకున్నారని, ఇదే చంద్రబాబు విజన్ అని అన్నారు ఈ కుంభకోణంపై స్పందించిన సీమెన్స్ సంస్థ తామెలాంటి ఒప్పందం చేసుకోలేదని తేల్చి చెప్పిందంటే చంద్రబాబు తన షెల్ కంపెనీల ద్వారా ప్రజల సొమ్ము రూ.371 కోట్లు దోచేసారని పేర్కొన్నారు. జిఎస్‌టి, ఇంటెలిజెన్స్ ఈడి, సిఐడి సంస్థలు సీమెన్స్ స్కిల్ ట్రైనింగ్ పేరుతో జరిగిన స్కాంపైన దర్యాప్తు చేస్తున్నాయని తెలిపారు. ప్రముఖ నిర్మాణ సంస్థ, ఎల్అండ్‌టి, షాపూర్జీ పల్లోంజీ కంపెనీల బిల్లులు ఆపేసి వాటి విడుదల కోసం భారీగా ముడుపులు తీసుకున్నారని అన్నారు. అధికారం కోసం రాష్ట్రాన్ని, వ్యవస్థలను నిర్వీర్యం చేస్తున్న చంద్రబాబును రాష్ట్ర ప్రజలు ఎన్నటికీ క్షమించరని.. 2024 ఎన్నికల్లో చంద్రబాబు అండ్-కో దోపిడీలు, పన్నాగాలకు వ్యతిరేకంగా ఓటు వేయడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. అచ్చెన్నాయుడు నియోజవర్గంలో ఏ గ్రామం అయినా వెళ్లి ప్రజలు కష్టాలు తెలుసుకొని ప్రభుత్వం దృష్టికి తెచ్చారా? అని ప్రశ్నించారు. ప్రజలు తమ ఖాతాలో నాలుగు సంవత్సరాలలో జగనన్న ప్రతి తెల్ల రేషన్ కార్డుదారనికి రెండు లక్షల రూపాయలు వేశారన్నారు ఈ పథకాలే తమ గెలుపునకు సహకరిస్తారయని అన్నారు.

మాట్లాడుతున్న దువ్వాడ శ్రీనివాస్

1న వీరగున్నమ్మ వర్ధంతి సభ

రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.మోహనరావు

ప్రజాశక్తి - మందస

ఏప్రిల్ 1న స్థానిక బస్టాండ్ వద్ద వీర గున్నమ్మ 83వ వర్ధంతి సందర్భంగా నిర్వహించే బహిరంగ సభను జయప్రదం చేయాలని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.మోహనరావు, సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి, ఆర్.దిలీప్‌కుమార్ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక సిఐటియు కార్యాలయంలో బహిరంగసభ కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దోపిడీ, పీడన, వెట్టిచాకిరి విముక్తి కోసం జరిగిన పోరాటాల్లో చారిత్రాత్మకమైనది మందస జమిందారీ వ్యతిరేక పోరాటమని అన్నారు. 1940 మార్చి 26, 27 తేదీల్లో పలాసలో జరిగిన అఖిల భారత కిసాన్ మహాసభల స్ఫూర్తితో జమిందారీ విధానంపై తిరుగుబాటు సాగించారని తెలిపారు. ఆ పోరాటంలో గున్నమ్మతో పాటు మరో ఐదుగురు రైతులు ప్రాణాలు కోల్పోయారని అన్నారు. నేటి పాలకులు దేశ సంపదను అదానీ, అంబానీలకు కట్టబెడుతూ, ప్రజలను కార్పొరేట్లకు తాకట్టు పెడుతున్నారని విమర్శించారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం ప్రజలపై భారాలు వేస్తూ, వారి సంక్షేమాన్ని గాలికొదిలేశారని అన్నారు. గత పోరాటాల స్ఫూర్తితో బిజెపి అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా మరో పోరాటం సాగించాలని పిలుపునిచ్చారు. ఈ బహిరంగసభకు మాజీ ఎంపీ, ఎపి రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.మధు హాజరవుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మట్ట ధర్మారావు, కె.కేశవరావు, హమాలీ సంఘం నాయకులు ఎస్.వల్లభరావు, సిహెచ్ అప్పన్న, గణేష్, గిరిజన సంఘం నాయకులు ఎస్.గురునాథ్, తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న మోహనరావు, తదితరులు

రెవెన్యూ సర్వీసుల సంఘం జిల్లా అధ్యక్షులుగా శ్రీరాములు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

రెవెన్యూ సర్వీసుల సంఘం జిల్లా అధ్యక్షులుగా పోలాకి తహశీల్దార్ కంచరాన శ్రీరాములు రెండోసారి ఎన్నికయ్యారు. ఆదివారం నగరంలోని రెవెన్యూ అతిథి గృహంలో జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మన్యం జిల్లా రెవెన్యూ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు శ్రీరామ్మూర్తి, విజయనగరం అధ్యక్షులు సుబ్రహ్మణ్యం, పార్వతీపురం డివిజన్ అధ్యక్షులు భాస్కరరావు ఎన్నికల అధికారులుగా వ్యవహరించారు. ఉదయం 9గంటల నుంచి నామినేషన్ ప్రక్రియ ప్రారంభమైంది. మధ్యాహ్నం 2గంటల వరకు సింగిల్ నామినేషన్ దాఖలు కావడంతో శ్రీరాములు ఎన్నిక ఏకగ్రీవమైనట్టు ప్రకటించారు. ప్రధాన కార్యదర్శిగా బివివిఎన్ రాజు, అసోసియేట్ అధ్యక్షునిగా పి.శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులుగా ఎస్.దిలీప్ చక్రవర్తి, ఎ.సింహాచలం, మురళీధర నాయక్, డి.పద్మావతిలు ఎన్నికయ్యారు. ఆర్గనైజింగ్ సెక్రటరీగా జికె శ్రీనివాసరావు, జాయింట్ సెక్రటరీలుగా ఎస్.గురుప్రసాద్, ఎస్.రాంబాబు, డి.అమర్‌నాథ్, జి.రామలింగేశ్వరరావు, కోశాధికారిగా జిఎల్ఇ శ్రీనివాసరావు, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ కార్యదర్శిగా ఐ.లింగరాజు, కార్యనిర్వాహక సభ్యులుగా డి.శ్రీనివాసరావు, ఎం.గౌరీశంకర్, జాఫర్ షరీఫ్, పి.గణేష్, బి.సంతోష్‌కుమార్, బి.శ్రీనివాసరావు, పైడి కృష్ణకాంత్ ఎన్నికయ్యారు. 2026 వరకు ఈ కార్యవర్గం కొనసాగుతుందని ఎన్నికల అధికారి వెల్లడించారు. ఈ సందర్భంగా ప్రమాణ స్వీకారం చేయించారు.

కార్యక్రమంలో స్పెషల్ డెప్యూటీ కలెక్టరు సనపల సుధాసాగర్, రెవెన్యూ సర్వీసుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పప్పల వేణుగోపాల్, ప్రవల్లిక, గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గం

చైతన్యస్ఫూర్తి నింపిన కవితాగోష్టి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

నేటి సమాజంలో కవితలు, కవిత్వంపై ప్రజల్లో ఆసక్తి పెంచడానికి చైతన్యవంతమైన కవితా పఠనం అవసరమని సాహితీ స్రవంతి కన్వీనర్ కె.శ్రీనివాసు అన్నారు. నగరంలోని యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో ఆదివారం కవితా గోష్టి కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రీనివాసు స్వీయకవితా పఠనంతో కవితా గోష్టి ప్రారంభమైంది. పలువురు కవులు, రచయితలు తమ కవితలను చదివి వినిపించారు. కవితా గోష్టి ఆద్యంతం చైతన్య స్ఫూర్తినిచ్చింది. కవులు చింతాడ తిరుమలరావు, పూజారి దివాకర్, నెట్టిమి రమణారావు, తంగి ఎర్రమ్మ, వాడపల్లి గోపాలకృష్ణమూర్తి, మండ ప్రభాకర్, వావిలపల్లి రాజారావు పలు సామాజిక సాంస్కృతిక అంశాలపై రాసిన తమ స్వీయ కవితలను వినిపించారు. కవితా పఠనంతో కార్యక్రమం రసవత్తరంగా సాగింది. గాయకులు చింతాడ రామచంద్రరావు తన గాన మాధుర్యంతో శ్రోతలను రంజింపజేశారు. కార్యక్రమంలో కవయిత్రి అల్లాడ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కవితా గోష్టిలో పాల్గొన్న కవులు, రచయితలు

గుర్తింపుకార్డులకు దళారులను నమ్మొద్దు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న నవరత్నాల్లో భాగంగా అందిస్తున్న కళాకారుల పింఛన్లకు అవసరమైన గుర్తింపు కార్డుల కోసం దళారులను నమ్మి మోసపోవద్దని జిల్లా పౌర సంబంధాల అధికారి కె.బాలమాన్ సింగ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గతంలో కార్యాలయం నుంచి జారీ చేసిన కార్డుల మాదిరిగానే కొందరు దళారులు కళాకారుల వద్ద నుంచి అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేసి నకిలీ గుర్తింపుకార్డులను తయారు చేస్తున్నట్లు సమాచారం అందిందని తెలిపారు. ఇప్పటికే జలుమూరు, కొత్తూరు, నరసన్నపేట తదితర మండలాల పరిధిలోని డప్పు, ఇతర కళారంగాలకు చెందిన కళాకారులు తమ పింఛన్ల విషయమై గ్రామ సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోగా, వాటిని నకిలీ గుర్తింపు కార్డులుగా గుర్తించినట్లు పేర్కొన్నారు. కళాకారులు తమ గుర్తింపు కార్డుల కోసం ఎటువంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు.

జిల్లా పర్యాటక అధికారి నుంచి దరఖాస్తులను పొంది పూరించిన దరఖాస్తుతో పాటు అవసరమైన ధ్రువీకరణ పత్రాలను జత చేసి జిల్లా పర్యాటక అధికారికి సమర్పించాలని సూచించారు. అటువంటి దరఖాస్తులు మాత్రమే జిల్లా కళాకారుల గుర్తింపుకార్డుల సమన్వయ కమిటీ ఆమోదంతో గుర్తింపు కార్డులు మంజూరు కాబడతాయని స్పష్టం చేశారు. జిల్లాలో కొత్తగా గుర్తింపు కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలనే కళాకారులు ఈ విషయాన్ని గమనించి, నేరుగా దరఖాస్తులను జిల్లా పర్యాటక అధికారికి సమర్పించాలని సూచించారు.

పకడ్బందీగా 'పది' పరీక్షలు

- 149 పరీక్షా కేంద్రాల ఏర్పాటు
- కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పన
- వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ
- జిల్లా విద్యాశాఖ అధికారి జి.పగడాలమ్మ

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఏప్రిల్ మూడో తేదీ నుంచి జిల్లాలో ప్రారంభం కానున్న పదో తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి జి.పగడాలమ్మ తెలిపారు. పరీక్షల నిర్వహణకు సంబంధించి అన్ని ఏర్పాట్లను దాదాపుగా పూర్తి చేసినట్లు చెప్పారు. 149 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని, గతం కంటే పరీక్షా కేంద్రాల సంఖ్యను కుదించినట్లు తెలిపారు. పరీక్షల నిర్వహణకు సంబంధించిన పలు అంశాలపై ముఖాముఖిలో వెల్లడించారు.

పదో తరగతి పరీక్షల నిర్వహణకు ఎటువంటి చర్యలు చేపడుతున్నారు?

జిల్లాలో పదో తరగతి పరీక్షల నిర్వహణకు విద్యాశాఖ ప్రణాళికాబద్ధంగా ఏర్పాట్లు చేస్తోంది. ఇప్పటికే పరీక్షా కేంద్రాలను గుర్తించాం. అక్కడ మౌలిక సదుపాయాలను పరిశీలించాం. జిల్లాలో మొత్తం 561 ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల నుంచి 29,545 మంది పదో తరగతి పరీక్షలు రాసేందుకు సన్నద్ధమవుతున్నారు. పాఠశాల విద్యాశాఖ ఏప్రిల్ 3 నుంచి పది పరీక్షలు నిర్వహించేందుకు షెడ్యూల్‌ను ప్రకటించింది. 18వ తేదీ వరకు పరీక్షలు కొనసాగుతాయి. అందులో భాగంగా ప్రభుత్వ ఆదేశాలను అనుసరించి పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నాం.



జిల్లాలో ఎన్ని పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు?

విద్యార్థుల సంఖ్యను బట్టి పరీక్షా కేంద్రాలను తగ్గించాం. గతంలో కోవిడ్ కారణంగా పరీక్షా కేంద్రాల సంఖ్యను పెంచి విద్యార్థులకు మధ్య దూరంగా ఉండే విధంగా జాగ్రత్తలు పాటించాం. ప్రస్తుతం సాధారణ స్థితి నెలకొనడం వల్ల గతంలో ఉన్న కేంద్రాల సంఖ్యను తగ్గించడమైంది. ఈసారి 149 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశాం. కేటగిరీల వారీగా కేంద్రాలను ఏర్పాటు చేసి విద్యార్థుల సంఖ్యను కేటాయించడానికి చర్యలు చేపడుతున్నాం. ఇందులో ఎ-కేటగిరీ కేంద్రాలు 57, బి-కేటగిరీ 29, సి-కేటగిరీ 63 గుర్తించి పరీక్షల నిర్వహణకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం.

మెరుగైన ఫలితాల సాధనకు ఎటువంటి చర్యలు చేపట్టారు?

గతేడాది కరోనా ప్రభావం, తరగతుల నిర్వహణ సక్రమంగా లేకపోవడం వల్ల ఆశించిన స్థాయిలో పదో తరగతిలో ఉత్తీర్ణతా శాతం తగ్గింది. ఈసారి అలాకాకుండా శతశాతం ఉత్తీర్ణత సాధించాలని ముందుగా లక్ష్యాన్ని నిర్దేశించాం. అందుకు అనుగుణంగా ప్రణాళికాబద్ధంగా తరగతుల నిర్వహణ, వారి నుంచి పునశ్చరణ వంటి జాగ్రత్తలు తీసుకున్నాం. అందువల్ల మెరుగైన ఫలితాలు ఈసారి సాధించగలమన్న నమ్మకం ఉంది. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతూ పదో తరగతి పరీక్షలు రాయనున్న ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించేలా ప్రణాళికాబద్ధంగా తరగతులు నిర్వహించాం. ప్రస్తుతం పున:శ్చరణ తరగతులు నిర్వహిస్తున్నాం. ముందస్తు ప్రిపరేటరీ తరగతులతో పాటు పరీక్షల నిర్వహణకు సిద్ధం చేశాం.

వెనుకబడిన విద్యార్థుల విషయంలో ఎటువంటి శ్రద్ధ తీసుకున్నారు?

ఇటీవల నిర్వహించిన సమ్మేటివ్, ఫార్మేటివ్ పరీక్షల్లో సి, డి గ్రేడుల్లో నిలిచిన విద్యార్థులపై శ్రద్ధ తీసుకుంటున్నాం. దీనిపై ఇప్పటికే ప్రధానోపాధ్యాయులకు పలు సూచనలు చేశాం. విద్యార్థులను ఇళ్ల వద్ద చదివించడం తల్లదండ్రుల బాధ్యత. వారిని ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండేందుకు మాట్లాడడం జరుగుతోంది. మరోవైపు నిపుణులు తయారు చేసిన మాదిరి ప్రశ్నాపత్రాల సాధన చేయిస్తున్నాం. ఎంపిక చేసిన అంశాలపై పట్టు సాధించేలా తర్ఫీదు ఇస్తున్నాం.

పదో తరగతి విద్యార్థులకు సంబంధించి పాఠశాలల్లో అమలు చేస్తున్న పలు కార్యక్రమాల పర్యవేక్షణపై దృష్టిసారిస్తున్నాం. నాతో పాటు సమగ్ర శిక్ష ఎపిసి, ఉప విద్యాశాఖాధికారులు, మండల విద్యాశాఖాధికారులు, సీనియర్ ప్రధానోపాధ్యాయులు తనిఖీలకు వెళ్తున్నాం. లోటుపాట్లు ఉంటే వాటిని సరిదిద్దడం, ఉపాధ్యాయులకు పలు సూచనలు చేస్తున్నాం.

పరీక్షా కేంద్రాల్లో పూర్తిస్థాయిలో మౌలిక సౌకర్యాలు కల్పించారా?

విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. పరీక్షా కేంద్రాల్లో ఎలాంటి సమస్యలు లేకుండా చూడాలని ఇప్పటికే మండల స్థాయి అధికారులు, పరీక్షా కేంద్రాల నిర్వహణకు ఎంపిక చేసిన పాఠశాలల ప్రదానోపాధ్యాయులకు ఆదేశాలు జారీ చేశాం. మౌలిక వసతులు ఉండే విధంగా చర్యలు తీసుకుంటున్నాం. తాగునీరు, మరుగుదొడ్ల సదుపాయం తప్పనిసరిగా ఉండాలి. తరగతి గదుల్లోకి వెలుతురు సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం. ఆ దిశగా ఉన్నతస్థాయిలో పర్యవేక్షణ జరుగుతోంది.

మొక్కను నాటుతున్న విద్యార్థులు

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని నైర వ్యవసాయ కళాశాలల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ జి.ఎస్.రాయ్ అన్నారు. శ్రీకాకుళం మండలం మండలం అలికాంలో జాతీయ సేవా పథకంలో భాగంగా కళాశాల కళాశాల విద్యార్థులు ఆదివారం రోడ్డుకు ఇరువైపులా మొక్కలను నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిరంతరాయంగా గ్రామంలో చేపట్టడంతో పరిసరాలు పరిశుభ్రంగా ఉంటున్నాయని అన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలన్నారు. కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ శ్రీసంధ్య మాట్లాడుతూ పచ్చదనం-పరిశుభ్రత ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. అనంతరం గ్రామంలో వివిధ పరిసరాలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు డాక్టర్ అనీల్, పురుషోత్తం, సర్పంచ్ రంధి అప్పలస్వామి, ఎంపిటిసి నాగేశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.

క్రీడాకారునికి ఆర్థికసాయం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఆర్థికసాయం అందజేస్తున్న వెంకన్న యాదవ్

విద్యతో పాటు క్రీడల్లో రాణిస్తే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు తోనంగి వెంకన్న యాదవ్ అన్నారు. నగరంలోని హయాతీనగరంలోని ఆయన నివాసంలో జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన తైక్వాండో క్రీడాకారుడు ఆకుల ప్రశాంత్‌కుమార్‌ను ఆదివారం అభినందనలు తెలుపుతూ ప్రయాణ ఖర్చులకు ఆర్థికసాయం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేదరికంలో ఉన్న తల్లిదండ్రుల ప్రోత్సాహంతో జాతీయస్థాయి క్రీడాకారునిగా రాణించడం అభినందనీయమన్నారు. రాజస్థాన్‌లో ఈ నెల 28 నుంచి 31 వరకు జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటున్న ప్రశాంత్‌కు శుభాకాంక్షలు తెలిపారు. జాతీయస్థాయిలో రాణించి జిల్లా పేరును రాష్ట్ర నలుమూలలా చాటాలన్నారు. కార్యక్రమంలో తైక్వాండో అసోసియేషన్ ఆఫ్ జిల్లా, ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా జాయింట్ సెక్రటరీ కొమర భాస్కరరావు, జిల్లా ఉషు అసోషియేషన్ ప్రధాన కార్యదర్శి రెడ్డి శివకుమార్ పాల్గొన్నారు.

గ్రంథాలయాల్లో 'చదవడం మాకిష్టం'

లావేరు : లావేరు శాఖాగ్రంథాలయంలో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో వేమన, సుమతీ శతకాలు పోటీ నిర్వహించారు. బాగా చదివిన ముగ్గురికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు అందజేశారు. గ్రంథాలయ సహాయకులు జి.గడ్డియ్య విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే మురపాక శాఖాగ్రంథాలయంలో చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు మాట్లాడుతూ చదవడం మాకిష్టం కార్యక్రమాన్ని ప్రతి విద్యార్థి వినియోగించుకోవాలన్నారు. ఇందులో గెలుపొందిన విద్యార్థులకు గ్రంథాలయాధికారి పి.రాముకు ప్రథమ, ఎస్.జ్యోతికి ద్వితీయ, ఆర్.సూర్యనారాయణకు తృతీయ బహుమతులు గ్రంథాలయం తరుపున అందజేశారు. గ్రంథాలయ సహాయకులు జి.షణ్ముఖరావు పాల్గొన్నారు.

'చలో ఢిల్లీ'ని విజయవంతం చేయాలి

ప్రజాశక్తి- పలాస

కార్మిక, కర్షక హక్కుల కోసం, మోడీ ప్రభుత్వ కార్మిక, రైతాంగ, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఏప్రిల్ 5న చేపట్టే చలో ఢిల్లీని జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక సిఐటియు కార్యాలయంలో చలో ఢిల్లీ పోస్టర్‌ను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, కనీస పెన్షన్ రూ.10వేలు ఇవ్వాలని, కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి అని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్, టైం స్కేల్, స్కీం వర్కర్లను క్రమబద్ధీకరించాలని, ఉపాధి హామీకి బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని అన్నారు. కార్యక్రమంలో ఎం.లావణ్య, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు

పలాస : పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిఐటియు నాయకులు

టి.సింహాద్రి, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు సిహెచ్ మురగన్, జి.జ్యోతి, పద్మావతి, ఢిల్లేశవరి, భాగ్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు: ఏప్రిల్ 5న నిర్వహించే చలో ఢిల్లీ పోస్టర్‌ను వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జి.సింహాచలం, కౌలు రైతు సంఘం జిల్లా నాయకులు బమ్మిడి ఆనందరావు

వజ్రపుకొత్తూరు : పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధి హామీ పరిరక్షణ, గిట్టుబాటు ధర, కార్మిక చట్టాల కుదింపును వ్యతిరేకిస్తూ చేపట్టే ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బి.శ్రీరాములు, ఎన్.మోహనరావు, టి.భాస్కరరావు, బి.రామకృష్ణ, డి.భాస్కరరావు, భానుమతి, ఎన్.ఈశ్వరమ్మ పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న పద్మజ

విద్యార్థుల్లో పోటీతత్వం అవసరం

టెక్కలి: విద్యార్థుల్లో పోటీతత్వం ప్రస్తుత సమాజానికి అవసరమని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు ఉర్జాన దుర్గాప్రసాద్ అన్నారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు ప్రతిభా పరీక్ష నిర్వహించారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ఆదివారం రవీంద్ర భారతి పాఠశాల ప్రిన్సిపాల్ పద్మజ బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు పోటీ ప్రపంచంలో మనుగడ సాగించాలంటే విద్యార్థుల్లో నైపుణ్యత అవసరమని అన్నారు. విజేతలుగా నిలిచిన వి.యామిని, కె.చరణ్, ఎల్.కిరణ్‌కుమార్‌కు బహుమతులు అందించారు. ప్రిన్సిపాల్ పద్మజ మాట్లాడుతూ స్వచ్ఛంద భాగస్వామ్యంతో విద్యార్థి సంఘాలు కృషి చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు సిహెచ్ రవితేజ, ఉమామహేష్, తదితరులు పాల్గొన్నారు.

టిడిపి ఎమ్మెల్సీల గెలుపుపై హర్షం

ఇచ్ఛాపురం : పట్టభద్రుల, ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ ఘన విజయం సాధించడంపై టిడిపి నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా టిపిడబ్ల్యు పార్లమెంట్ అధ్యక్షులు పూనా సంతోష్ మాట్లాడుతూ ఈ తీర్పు ప్రభుత్వానికి గుణపాఠమని అన్నారు. ఇకనైనా ఈ వైసిపి ప్రభుత్వం అభివృద్ధిపై దృష్టి పెట్టాలన్నారు. ప్రతిపక్షాలను అణచడమే లక్ష్యంగా అనుసరిస్తున్న విధానాలను మానుకోవాలన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు కాళ్ల జైదేవ్, పట్టణ ఐటిడిపి అధ్యక్షుడు సాలిన జగదీష్, 17వ వార్డు టిడిపి ఇన్‌ఛార్జి జన్నెల సంతోష్‌కుమార్, ఇచ్ఛాపురం నియోజకవర్గ టిపిడబ్ల్యు సభ్యులు పైల నారాయణ పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల నిరసన

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

కేంద్ర ప్రభుత్వం ప్రజాస్వామ్య విలువలకు తిలోదకాలిచ్చి ప్రత్యర్థులపై దౌర్జన్యకాండ, తప్పుడు కేసులు పెడుతుందని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు బొడ్డేపల్లి సత్యవతి ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అగ్ర నాయకులు రాహుల్ గాంధీపై అనర్హత వేటుకు రాజకీయ కక్ష సాధింపు అని విమర్శించారు. ఎఐసిసి, పిసిసి పిలుపు మేరకు నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద గాంధీ విగ్రహం వద్ద ఆదివారం శాంతియుత నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో పాలక పక్షానికి, విపక్షానికి పార్లమెంట్‌లో సమానమైన అధికారాలు ఉంటాయని అన్నారు. పాలకపక్షం ఏదైనా తప్పు చేస్తే దాన్ని ప్రశ్నించే హక్కు ప్రతిపక్షానికి ఉంటుందన్నారు. ఇటీవల దేశ

నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

సంపదను కొల్లగొడుతున్న రాహుల్ ఆదానీతో, అంబానీలతో ప్రధాని మోడీకి ఉన్న సంబంధాన్ని పార్లమెంట్‌లో సాక్ష్యాధారాలతో నిరూపించి ప్రశ్నించినందుకే ఈ అనర్హత వేటు అని అన్నారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు సనపల అన్నాజీరావు, రెల్ల సురేష్, ఈశ్వరమ్మ, దేశెట్టి మల్లిబాబు పాల్గొన్నారు.

తూర్పుకాపు భవన నిర్మాణమే లక్ష్యం

మాట్లాడుతున్న తిరుమలరావు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

తూర్పుకాపు భవన నిర్మాణమే లక్ష్యంగా తూర్పుకాపులంతా ఐకమత్యంతో ముందుకు సాగాలని తూర్పుకాపు సంఘం నాయకులు డోల తిరుమలరావు అన్నారు. నగరంలోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ఆడిటోరియంలో తూర్పుకాపు అధ్యయన వేదిక జిల్లా అధ్యక్షులు శాసపు జోగినాయుడు అధ్యక్షతన ఆత్మీయ సమావేశం ఆదివారం నిర్వహించారు. స్థలం గుర్తింపు, నిధుల సేకరణపై చర్చించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తూర్పుకాపు అభివృద్ధికి, అభ్యున్నతికి సామాజిక భవన నిర్మాణం అవసరమన్నారు. సామాజిక, రాజకీయంగా, ఆర్థికంగా ఉన్నతంగా ఎదిగేందుకు చైతన్యం కావాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో డోల జగన్, సురంగి మోహనరావు, ఆనెపు రామకృష్ణ, ఎం.వి.స్వరూప్, కలిశెట్టి అప్పలనాయుడు, ఇజ్జాడ శివన్నారాయణ, లంక గాంధీ పాల్గొన్నారు. అనంతరం భవన నిర్మాణానికి నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా మోహనరావు, ఉపాధ్యక్షులుగా శివన్నారాయణమూర్తి, సెక్రటరీ లంక వెంకటప్పలనాయుడు, జాయింట్ సెక్రటరీ అలుగుబిల్లి నాగభూషణరావు, కోశాధికారి శాసపు జోగినాయుడు, మెంబర్లు జగన్, మోహనరావు, ఎల్.వి.రాజశేఖర్, వి.శ్రీరాములు, పిసిని చంద్రమోహన్, గేదెల వాసుదేవరావు, పి.మాధవిలను ఎన్నుకున్నారు. ఈ మేరకు ఎచ్చెర్ల నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, ఉత్తరాంధ్ర శిక్షణా తరగతుల మాజీ డైరెక్టర్ కలిశెట్టి అప్పలనాయుడు తూర్పు కాపుల సంఘం భవన నిర్మాణానికి రూ. 5 లక్షలు ప్రకటించారు.

జశ్వంత్ మృతదేహం

యువకుడు ఆత్మహత్య

టెక్కలి: నౌపడ రైల్వే గేట్ సమీపంలో రైలు కింద పడి యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మండలంలోని రావివలస పంచాయతీ చిననారాయణపురం గ్రామానికి చెందిన తండ్రి మురపాల గవరయ్య, అమ్ములమ్మ కుమారుడు మురపాల జశ్వంత్(19) పదో తరగతి చదివాడు. స్థానికంగా ఉన్న పరిశ్రమలో రోజు కూలీగా పని చేస్తున్నాడు. ఆదివారం ఇంటి నుంచి వెళ్లిన జశ్వంత్ ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు ఎదురు చూశారు. యువకుడు ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలియడంతో కుటుంబసభ్యులు ఘటనా స్థలికి చేరుకొని రోదించారు. యువకుడు మృతికి గల కారణాలు తెలియలేదు. పలాస రైల్వే పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వైసిపి వైఫల్యాలను వివరిస్తాం

టెక్కలి: వైసిపి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరిస్తామని జనసేన పార్టీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కణితి కిరణ్‌కుమార్ అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రజాస్వామ్యయుత పాలన జనసేన పార్టీకే సాధ్యమన్నారు. పార్టీ సిద్ధాంతాలను, ఆశయాలను, జనసేన పార్టీ అధికారంలోకి వస్తే ప్రజలకు ఏమి చేస్తుందో గ్రామాల్లో ప్రచారం చేస్తున్నామని అన్నారు. ప్రజల నుంచి వచ్చే సమస్యలను అధినేత దృష్టికి తీసుకెళ్తామన్నారు. అట్టాడ శ్రీధర్, పేడాడ త్రివేణి, ఎల్.కుమారస్వామి, కొత్తూరు హరి, బి.క్రాంతి, తదితరులు పాల్గొన్నారు.

రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి సురేష్

వైద్య శిబిరానికి స్పందన

ఆమదాలవలస : మండలంలోని బొబ్బిలిపేటలో శ్రీకాకుళం నగరానికి చెందిన సన్‌రైజ్ ఆస్పత్రి అధినేత, వైద్యులు, సంఘ సేవకులు డాక్టర్ బొడ్డేపల్లి సురేష్ ఆధ్వర్యాన ఆదివారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి స్పందన లభించింది. ఈ మేరకు 300 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేసవి తీవ్రత దృష్ట్యా ప్రజలు ఎండలో ఎక్కువగా తిరగవద్దని అన్నారు. అధిక మొత్తంలో నీరు, కొబ్బరి నీళ్లు, పళ్ల రసాలు తీసుకోవడంతో వడదెబ్బ నుంచి రక్షణ పొందవచ్చని తెలిపారు. మలేరియా, డయేరియా వంటి వ్యాధులపై నిర్లక్ష్యంగా ఉండకూడదన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. తరచూ బిపి, సుగర్‌లను పరీక్షించుకోవాలన్నారు. క్రమం తప్పకుండా మందులను వాడాలన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్ద గురుగుబెల్లి చలపతిరావు, కూన రమేష్, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగుకు కృషి

సోంపేట: పంచాయతీ పరిధిలో పారిశుధ్యం మెరుగుకు కృషి చేస్తున్నామని పలాసపురం సర్పంచ్ తడక జోగారావు తెలిపారు. గ్రామంలో మహిళా సంఘాల సభ్యులతో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పారిశుధ్య నిర్వహణకు అందరూ సహకరించాలని కోరారు. అలాగే మహిళా సంఘ సభ్యులకు ముఖ్యమంత్రి ఆసరా సొమ్ము విడుదల చేశారన్నారు. వాటిని మహిళలంతా తమ అభివృద్ధికి వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి తడక యశోద తదితరులు పాల్గొన్నారు.

నాటి గురువులతో విద్యార్థులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

వజ్రపుకొత్తూరు: గోవిందపురం జెడ్‌పి ఉన్నత పాఠశాల 1985-86 టెన్త్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక ఉత్సాహపూరిత వాతావరణంలో సాగింది. తమ గురువులను సాదరంగా ఆహ్వానించి దుశ్శాలువలతో సత్కరించారు. చిన్ననాటి స్నేహితులు, గురువులను పలకరించుకుంటూ వారి యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. నాటి మధుర జ్ఞాపకాలతో పరవశించిపోయారు. ఉపాధ్యాయులు విద్యార్థులు మాట్లాడుతూ తమ అనుభవాలను పంచుకున్నారు. నిర్వాహకులు కొంచాద శేఖర్, కనితి నారాయణమూర్తి, పేరడ యుగంధర్, దున్న రమేష్, రెయ్య మాధవరావు, గుంట షణ్ముఖరావు అభినందించారు.

ఘనంగా ఆలయ ప్రతిష్ట

కవిటి: మండలంలోని భైరిపురంలో త్రినాథస్వామి ఆలయ పున ప్రతిష్ట ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే అశోక్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన అన్నదానంలో యాత్రికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో బుర్ర శ్యామలరావు, తలగాన చిరంజీవులు, పుల్లట రామకుమార్, ప్రియా రాజగోపాల్, ప్రియా మురళి, బల్లెడ సృజన్, తదితరులు పాల్గొన్నారు.

ధ్రువపత్రాన్ని అందజేస్తున్న జోహార్‌ఖాన్

ఘనంగా యుకెజి స్నాతకోత్సవం

ఇచ్ఛాపురం : స్థానిక జ్ఞాన భారతి విద్యా సంస్థలో యుకెజి చిన్నారులు స్నాతకోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. విద్యా సంస్థల కార్యదర్శి జోహార్ ఖాన్ అధ్వర్యాన 75 మంది చిన్నారులకు అర్హత ధ్రువపత్రాలను అందించారు. ఈ సందర్భంగా జోహార్ ఖాన్ మాట్లాడుతూ యుకెజి చిన్నారులు ఇక నుంచి ఒకటో తరగతిలో మరింత ఉత్సహంగా, ఉత్తేజంగా, ఆడుతూ పాడుతూ చదువు కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో ట్రస్టీ రమణమూర్తి, ప్రిన్సిపాల్ ఐ.బి.పండా, ఎఒ ప్రేమ సర్తాజ్ ఖాన్, ప్రమోద్‌కుమార్, రసీద సుల్తాన్ పాల్గొన్నారు.

సంబరాలకు సిద్ధమవుతున్న బాహుబలి ప్రవేశ ద్వారం

శుభరాటకు సర్వం సిద్ధం

ఇచ్ఛాపురం: ఏప్రిల్ 17 నుంచి నెల రోజుల పాటు సాగే శ్రీ స్వేచ్ఛావతి అమ్మవారి సంబరాల్లో భాగంగా సోమవారం వేసే శుభరాటకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ అభివృద్ధి కమిటీ తెలిపింది. పదేళ్ల తరువాత జరుగుతున్న గ్రామ దేవత ఉత్సవాలు అత్యంత ఘనంగా నిర్వహించేందుకు కమిటీ అన్ని ఏర్పాట్లు చురుకుగా చేస్తోందన్నారు. గ్రామ దేవత సంబరాల్లో ప్రత్యేకతగా నిలిచే బాహుబలి ప్రవేశ ద్వారం నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. శుభ రాటకు సంబంధించి ఇచ్ఛాపురం సమీపంలో ఉన్నా ఒడిశా రాష్ట్రం సురాంగి గ్రామ దేవత శ్రీ కురాషిని అమ్మవారు సన్నిధి నుండి వెదురు రాటను తీసుకొచ్చి పట్టణంలో ఉన్న రాజా వారు కోట వద్ద భద్రపరుస్తారు. సోమవారం ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు అనంతరం కోట వద్ద వెదురు గెడకు పూజలు నిర్వహించి శోభాయాత్రగా చేసుకొని ఆలయంలో పూజలు చేసి ఉప్పల వీధిలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదిక వద్ద శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి, శుభ రాట వేస్తారు. ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని రకాల చర్యలు తీసుకున్నట్లు కమిటీ తెలిపింది.

'వంశధార'లో పేదలకు అందుబాటులో విద్య

మాట్లాడుతున్న ఎంపిపి ఉమామల్లేశ్వరరావు

కోటబొమ్మాళి: పేదలకు అందుబాటులో విద్యను వంశధార రెసిడెన్షియల్ పాఠశాలలో లభిస్తోందని ఎంపిపి ఉమామల్లేశ్వరరావు, జెడ్‌పిటిసి డి.వెంకటరావు అన్నారు. పాఠశాలను స్థాపించి 37 ఏళ్ళు పూర్తయిన సందర్భంగా పాఠశాల అవరణలో ఘనంగా వార్షికోత్సవం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా విచ్చేసిన వీరు మాట్లాడుతూ మండలంలో మొట్టమొదటగా స్థాపించిన ప్రైవేటు పాఠశాల ఇదేనని అన్నారు. వంశధార విద్య సంస్థల చైర్మన్ చింతాడ వరణ్ మాట్లాడుతూ తమ పాఠశాలలో చదువుకున్న విద్యార్థులు ఒక్క సివిల్స్‌లో తప్ప అన్ని రంగాల్లోనూ ఉన్నారని, సివిల్స్‌లో కూడా విద్యార్థులు రాణించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ సంపతిరావు హేమసుందరరాజు, మండల పరిషత్ ఉపాధ్యక్షులు బోయిన నాగేశ్వరరావు, సర్పంచ్ కాళ్ల సంజీవరావు, నాయకులు అన్నెపు రామారావు, పేడాడ వెంకటరావు, నాయకులు కర్రి అప్పారావు, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

నేడు వాహనాల వేలం

సోంపేట : స్థానిక ఎన్‌ఫోర్స్‌మెంట్ కార్యాలయం వద్ద 22 ద్విచక్ర వాహనాల వేలాను సోమవారం ఉదయం నిర్వహించనున్నట్లు కార్యాలయ అధికారి వెంకటప్పలనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యాన నిర్వహించిన దాడుల్లో సీజ్ చేసిన వాహనాలను వేలం వేస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గల వారు పాల్గొని రూ.వెయ్యి ధరావత్ చెల్లించి, తమ ఆధార్ కార్డుతో పాటు వేలంపాటి పాల్గొనాలని తెలిపారు.

ఆమదాలవలస : గతేడాది వివిధ కేసుల్లో పట్టుబడిన రెండు ద్విచక్ర వాహనాలకు సోమవారం బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.సునీల్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశం మేరకు మెట్టక్కివలసలో ఉన్న కార్యాలయం వద్ద ఉదయం 10.30 గంటలకు వేలం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గల వారు ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం రూ.వెయ్యి ఎంట్రీ ఫీజు కట్టి ఆధార్ కార్డుతో హాజరుకావాలని తెలిపారు.

29న చింతాడ వారపు సంత...

2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పురపాలక సంఘానికి చెందిన చింతాడ వారపు సంతలో ఆశీలు వసూలు హక్కుకు ఈ నెల 29న మధ్యాహ్నం నాలుగు గంటలకు పురపాలక సంఘ కార్యాలయ ఆవరణలో రెండో సారి బహిరంగ వేలం నిర్వహించబడునని ఇన్‌ఛార్జి కమిషనర్ కె.అప్పలనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న కాంట్రాక్టర్లు ఈ వేలంలో పాల్గొనవచ్చునని అన్నారు. మిగతా వివరాలకు కార్యాలయ పనివేళలో సంప్రదించాలన్నారు.

రేపటి నుంచి సీతారామ కళ్యాణం

రణస్థలం : మండలంలోని పున్నానపాలెంలో ఈ నెల 28, 29, 30 తేదీల్లో మూడు రోజుల పాటు సీతారామ కళ్యాణం, అప్పం పేరంటాలు, సంతోషిమాత మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తామని నిర్వాహకులు పున్నాన నరసింహులు నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో యాత్రికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఐదు రిజిస్ట్రేషన్లు

ఇచ్ఛాపురం: జిల్లా రిజిస్ట్రార్ శాఖ అదేశాల మేరకు ఆదివారం విధులు నిర్వహించి ఐదు రిజిస్ట్రేషన్లు చేశామని ఇచ్ఛాపురం సబ్ రిజిస్ట్రార్ కె.కమల తెలిపారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సిబ్బంది విధుల్లో పాల్గొన్నారని అన్నారు. ఆర్థిక సంవత్సరం చివరి రోజులు కావడంతో ఆదివారం విధులు నిర్వహించామని అన్నారు.

ఘనంగా అచ్చెన్న జన్మదిన వేడుకలు

నదిగాం : కేకును కట్ చేస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, టెక్కలి ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు జన్మదిన వేడుకలను నాయకులు ఘనంగా నిర్వహించారు. నగరంలోని టిడిపి కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి పాల్గొని కేక్‌ను కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. కార్యక్రమంలో టిడిపి నగర అధ్యక్షులు మాదారపు వెంకటేష్, కలగ జగదీష్, పి.ఎం.జె.బాబు పాల్గొన్నారు. అలాగే సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షులు గొండు శంకర్ ఆధ్వర్యాన గార మండలం శ్రీకూర్మం, నగరంలోని ఏడు రోడ్ల కూడలి వద్ద అచ్చెన్నాయుడు పుట్టినరోజు సందర్భంగా కేను కట్ చేశారు. అనంతరం పేదలకు దుస్తులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రెడ్డి శంకర్, అంబటి లక్ష్మీరాజ్యం తదితరులు పాల్గొన్నారు.

మెళియాపుట్టి : అచ్చెన్నాయుడు జన్మదినం సందర్భంగా టిడిపి మండల అధ్యక్షులు భాస్కర్ గౌడ్, జిల్లా మహిళా ఉపాధ్యక్షులు బూర్ల లలితకుమారి, ప్రధాన కార్యదర్శి ఉల్లాన వసంత్, పరమేష్ రెడ్డి, పడాల శ్రీను, మాలతి శ్రీధర్ కేక్‌ను కట్ చేసి అందరికీ పంచిపెట్టారు.

కోటబొమ్మాళి: టిడిపి రాష్ట్ర అధ్యక్షులు, ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు 52వ జన్మదిన వేడుకలను టిడిపి నాయకులు ఘనంగా నిర్వహించారు. కోటబొమ్మాళి శ్రీ కొత్తమ్మతల్లి ఆలయంలో అచ్చెన్న పేర ప్రత్యేక పూజలు చేశారు. టిడిపి మండల అధ్యక్షులు బోయిన రమేష్, బోయిన గోవిందరాజుల ఆధ్వర్యాన కేకు కోసి, కార్యకర్తలకు పంచిపెట్టారు. మాజీ పిఎసిఎస్ అధ్యక్షులు హరివరప్రసాద్ జన్మదినం సందర్భంగా కేకు కట్ చేశారు. కార్యక్రమంలో వి.కామేశ్వరరావు, తర్ర రామకృష్ణ, డి.సింహాద్రి, పి.శైలజ, తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్ : కేక్‌ను కట్ చేస్తున్న లక్ష్మీదేవి

శ్రీకాకుళం అర్బన్ : దుస్తులు పంపిణీ చేస్తున్న గొండు శంకర్

కోటబొమ్మాళి : కేకును కట్ చేస్తున్న టిడిపి నాయకులు

హరిశ్చంద్రపురం పంచాయతీలో మాజీ సర్పంచ్ పూజారి శైలజ, సత్యన్నారాయణ అచ్చెన్న జన్మదిన కేకును కోశారు. కొత్తపేటలో యువసేన నాయకులు ఎం.లక్ష్మణరావు కేకు కోసి, పంచిపెట్టారు.

పలాస: స్థానిక టిడిపి కార్యాలయంలో ఆదివారం అచ్చెన్న జన్మదిన కేకును కోసి, పంచిపెట్టారు. హనుమాన్ ఆలయంలో అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో పి.విఠల్‌రావు, ఎల్.కామేశ్వరరావు, జి.సూర్యనారాయణ, గాలి కృష్ణారావు, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

నందిగాం: టిడిపి కార్యాలయంలో అచ్చెన్న పుట్టిన రోజు కేకును కోసి పిల్లలు, కార్యకర్తలకు పంచిపెట్టారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు పి.అజయ్‌కుమార్, మహేష్, కె.ప్రసాదరావు, తాతయ్య, జానకిరామ్, సింహాచలం, తదితరులు పాల్గొన్నారు.

టెక్కలి: అచ్చెన్న జన్మదినం సందర్భంగా టిడిపి కార్యాలయంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. మండల అధ్యక్షులు బి.శేషగిరి ఆధ్వర్యాన కేకు కోసి, పంచిపెట్టారు. కార్యక్రమంలో పి.షణ్ముఖరావు, ఎం.దమయంతి, హెచ్.రామకృష్ణ, ప్రసాద్‌రెడ్డి, రెయ్యి ప్రతీష్ చంద్, కె.కామేష్, తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి

డిప్యూటీ డిఇఒ తిరుమల చైతన్య


పోలాకి: మాట్లాడుతున్న తిరుమల చైతన్య

ప్రజాశక్తి- పోలాకి

నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులు రాణించాలంటే నైపుణ్యాలను పెంపొందించుకోవాలని జిల్లా ఉప విద్యాశాఖాధికారి తిరుమల చైతన్య సూచించారు. ఆదివారం స్థానిక విశ్వశాంతి హైస్కూల్‌లో ఫేర్‌వెల్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు ఆధునిక పరిజ్ఞానంపై అవగాహన కలిగి ఉండాలని, బాగా చదివి మంచి ఫలితాలు సాధించి, ఉన్నత చదువులు చదవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ మెట్ట జనార్ధనరావు, తిరుమలరావు, రామ్మోహనరావు, ఉపాధ్యాయులు ఎం.అప్పలనాయుడు, శాంతారావు, లోకనాథం, తదితరులు పాల్గొన్నారు.

టెక్కలి : నృత్యం చేస్తున్న విద్యార్థులు

రవీంద్రభారతిలో...

టెక్కలి: విద్యార్థులు తమలో దాగివున్న నైపుణ్యాలున వెలికితీయాంటే వారిలో నిబిడీకృతమైన విజ్ఞానాన్ని మెరుగుపర్చాలని రవీంద్రభారతి పాఠశాల ప్రిన్సిపాల్ పద్మజ అన్నారు. ఈ పాఠశాలలో ఆదివారం టెన్త్ విద్యార్థుల వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా డీన్ నాగరాజు మాట్లాడుతూ లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకొని, దాని సాధనకు కృషి చేయాలన్నారు. ఇటీవల నిర్వహించిన పరీక్షల్లో ప్రథమ స్థానం సాధించిన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థుల నృత్యాలు అలరించాయి. కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గీతాంజలిలో...

శ్రీకాకుళం అర్బన్ : నగరంలోని గీతాంజలి స్కూల్‌లో ఆదివారం ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకలను 9 తరగతి చదువుతున్న విద్యార్థులు పదో తరగతి విద్యార్థులకు స్వాగతం పలికారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు సినీ పాటలకు డాన్స్‌లు చేసి కేరింతలు కొడుతూ ఉత్సాహంగా గడిపారు. అనంతరం గీతాంజలి స్కూల్ కరస్పాండెంట్ సనపల ఉమాదేవికి బహుమతులను


ఉమాదేవికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న విద్యార్థులు

అందజేశారు. కార్యక్రమంలో అకాడమిక్ ఇన్‌ఛార్జి బొడ్డేపల్లి పద్మజ, ప్రధానోపాధ్యాయులు సింగూరు రాజు, ఉపాధ్యాయులు అనురాధ పాల్గొన్నారు.

విశాఖ స్కూల్‌లో...

శ్రీకాకుళం అర్బన్ : నగరంలోని బ్యాంకర్స్ కాలనీలో ఉన్న విశాఖ స్కూల్‌లో ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకలను 6,7,8,9 తరగతుల విద్యార్థులు పదో తరగతి విద్యార్థులకు స్వాగతం పలికారు. వచ్చే పబ్లిక్ పరీక్షల్లో మంచి విజయం సాధించాలని కోరారు. పాటలతో, డాన్స్‌లతో విద్యార్థులు కేరింతలు కొట్టారు. అనంతరం చైర్మన్ మధుసూదన్‌కు దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో స్కూల్ హెచ్ఎం రామారావు, సిబ్బంది పాల్గొన్నారు.

విశాఖ స్కూల్ చైర్మన్‌ను సన్మానిస్తున్న విద్యార్థులు